దేవుడి పెళ్లి జగుగుతూంది.

ఆకాశమంత పందిరీ, భూమంత అరుగూ వేసి జగన్నాథం దంపతులు దేవుడి పెళ్లి మహా వైభవంగా జరుపుతున్నారు.

మేళతాళాలూ, బంధుమిత్రులూ, మల్లెపువ్వులూ, మంచిగంధం, అత్తరూ, పన్నీరుల సువాసనలతో మత్తెక్కిస్తూంది ఆ పెళ్లి పందిరి వాతావరణం. దేవుడి పెళ్లికి వచ్చిన పెద్దల మీద పన్నీరు జల్లుగా కురుస్తూంది. స్త్రీలు పట్టు చీరెల పరపరలతో, చేతి గాజుల గలగలలతో ఇటూ, అటూ తిరుగుతున్నారే గానీ, తలలోని పూవులూ, ఒంటిన ఉన్న ఆభరణాల బరువూ వారిని క్రుంగదీసేస్తూన్నట్టు సొక్కుతూ, సోలుతూ తిరుగుతున్నారు. పాపం! ఆ అలసటకి వారి ఒళ్లంతా చెమటలు కారిపోతున్నాయి.

విసనకర్రలతో విసురుకునే ఓపిక కూడా లేదు వాళ్లకి, పాపం! ఇది గ్రహించిన పెళ్లిపెద్ద జగన్నాథం గారో గావుకేక పెట్టారు బొంగురు గొంతుతో— “పంఖాలు వెయ్యండర్రా” అని. పంఖాలు గిర్రున తిరగటం మొదలెట్టాయి. 'మైక్'లో పెళ్లి మంత్రాలు ఊరందరి చెవులూ చిల్లులు పడేలా వినిపిస్తున్నాయి. 'దేవుడి'పెళ్లికి అందరూ పెద్దలే అన్న సత్యం ఈ పెళ్లి పందిరిలోనే కనిపిస్తూంది.

జగన్నాథం గారు ముచ్చటగా మూడు లక్షలకి అధికారి. మన ప్రభుత్వం అధిక జనాభాని కంట్రోల్ చేయలేక అలిసిపోతూంది కానీ, జగన్నాథం గారికి వంశం నిలబెట్టే ఓ నలుసు లేదు. సంతానం కోసం ఎందరో దేవుళ్లని పూజిస్తున్నాడు. పూజించాడు. ఇంకా పూజిస్తూనే ఉంటాడు. ఎన్ని పూజలు చేసినా, ఎన్ని వ్రతాలు చేసినా, ఎందరు స్వాములని సేవించినా, మరెందరో అమ్మవార్ల తీర్థప్రసాదాలు తీసుకున్నా ఏమీ ప్రయోజనం లేకపోయింది ఇప్పటివరకూ. భవిష్యత్తు చెప్పలేముగా?

తమ కోరిక తీరకున్నా భగవంతుడిని సేవించటం మానలేదు జగన్నాథం దంపతులు. కేవలం పూజించటమే కాదు, తీర్థయాత్రలు చేస్తూ, ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా దేవుడి పెళ్లి వైభవోపేతంగా చేస్తూ తోటి వారి ప్రశంస అందుకుంటూనే ఉన్నారు. దేవుడి పెళ్లికి ఎంత లేదన్నా అయిదారు వేలు పైనే ఖర్చు అయిపోతుందని అంటారు. అయితే ఏం? దేవుడి పెళ్లికి కట్నాలూ, కానుకలూ కుంభవృష్టిగా కురుస్తాయి. ప్రతివారూ కానుకలు చెల్లించి, విందుభోజనం ఆరగించి “త్రేవ్” మని త్రేపి దేవుడి పెళ్లిని ఇంత భక్తిగా జరిపించిన జగన్నాథం గారిని ఆశీర్వదించి మరీ వెళ్లిపోతారు. ఇలా చాలా సంవత్సరాలుగా జరుగుతున్నది. అలాగే ఈ సంవత్సరమూ జరుగుతూంది.


పెళ్లి మంత్రాలు మైక్‌లో వినిపిస్తూనే ఉన్నాయి. వివాహానికి వచ్చిన బంధుమిత్రు అందరూ పెళ్లి పందిరిలోనే ఉన్నా, సీత మాత్రం దేవుడి పెళ్లికి తలంబ్రాలు పళ్లెంలో సర్దుతూ సామానుల గదిలోనే ఉంది.

ఈ సీత ఓ కుచేలుడి అయిదో కూతురు. తన తరవాత కూడా నలుగురు చెల్లాయి లున్నారు మరి. ఈ కాలంలో కూడా కలియుగ కుచేలురు అక్కడక్కడా కనిపిస్తూనే ఉంటారు అనేదానికి ఈ సీత తండ్రి గట్టి సాక్ష్యం.

ఈ కలియుగ కుచేలుడికి ఓ చిన్న ఉద్యోగం. వచ్చేది చాలక నరం లేని నాలుక ఇష్టం వచ్చినట్లు ఉపయోగించుకుని, వీలైనన్ని అబద్ధాలాడి, అప్పులు చేసి, చివరికి ఆటలు కట్టి తన్నులు తిని ఆ ఊరు నించి కాసరం ఎత్తుకు పారిపోబోతూంటే, అప్పటికే అయిదు వందలు అసలూ, దానికి వడ్డీ పెరిగి పెరిగి బోలెడంతైందన్న కోపంతో, అసలు కూడా గల్లంతవనే భయంతో జగన్నాథం భార్య మంగమ్మ అపరకాళిలా అడ్డగించింది.

తనని, తన పిల్లలని, భార్యని కూడా మింగేస్తుందేమో అన్న భయం పట్టుకుని తన “అప్పు”కి గాను అయిదో కూతుర్ని తాకట్టు పెట్టి ఆ ఊరు నించి వెనక్కి తిరిగి చూడకుండా పారిపోయాడు కుచేలుడు.

తండ్రి చేసిన అప్పుకుగాను తాకట్టు సొమ్ములా మిగిలిపోయింది సీతా మహాలక్ష్మి అనబడే ప్రాణం ఉన్న సీత. నాలుగు సంవత్సరాలు గడిచినా తండ్రి జాడ లేదు. చక్రవడ్డీ పెరిగి పెరిగి ఇంక ఈ అప్పు తీరేది కాదనీ, తనకి ఈ 'చెర' నుంచి విముక్తి లేదనీ సీత ఆలస్యంగా అయినా తెలుసుకుంది. సీత జగన్నాథం



గారి ఇంట్లో పనిమనిషి, చాకలి మనిషి, వంటమనిషి. ఇవన్నీ కాక, ఆ ఇంటి యజమానికి చాలా విధాల ఉపయోగి స్తూంది.

'ఆకలి కింత అన్నం, శరీరం కప్పు కునేందు కింత బట్టా ఉంటే చాలు, మరేం అక్కరలేదు' అనుకునేది సీత తలిదండ్రుల దగ్గర ఉపవాసా లుండే ప్పుడు. అయితే మంగమ్మ ఉదార హృదయం వల్ల సీత తిండికీ, బట్టకీ మరేం ఫర్వాలేదు. రెక్కలు ముక్కలు చేసుకుని ఎన్ని సంవత్సరాలు చాకిరీ చేసినా తండ్రి చేసిన అప్పు తీరేలా కనిపించ లేదు. ఈ జన్మ కిక ఇంతే ... తనకి ఒక్కడే తండ్రి. ఒక్కతే తల్లి. కానీ, వాళ్లకి మాత్రం తను ఒక్క కూతురే కాదు. అవును. అంతే. ఈ భావం రాగానే సీత మనస్సు పాషాణంలా అయిపోయింది.

యాంత్రికంగా రోజులు గడిచిపో తున్నాయి. అయితే ఒకే ఒక కోరిక సీతని విలవనీయటం లేదు. అదేమి టంటే, తనూ జీవితంలో ఒక్కసారి అంటే ఒక్కసారి పెళ్లికూతురు కావాలి.

కాళ్లకి పసుపు పారాణి, నుదుట కళ్యాణ తిలకం, బుగ్గన చుక్కా, కళ్లకి కాటుకా — ఈ అలంకరణలో పెళ్లి కూతురై పసుపుదారంలో మిలమిలా మెరిసిపోయే మంగళసూత్రం కట్టించు కోవాలి. వరు డెవరనే ఆలోచనే లేదు సీతకి. అలా పెళ్లికూతురై మాంగళ్య ధారణ జరుగుతుంది. మధుపర్కాలతో అగ్నిదేవుడికి ప్రదక్షిణాలు చేస్తూ ఉంటుంది. పెళ్లికి వచ్చిన అతిథులు ఒక్కసారి మంగళాక్షతలు వర్షంలా కురిపి స్తారు. అప్పుడు ... అప్పు డెంత బాగుం టుంది!

ఇది ఒక్కసారి జరిగితే చాలు. మరింకేం వద్దు. మిగిలిన జీవితం అంతా ఏ బానిస

# దేవుడి పెళ్లి

గోవిందరాజు సీతాదేవి

బ్రతుకైనా సరే, భరించగలదు. అవును. తనూ పెళ్లికూతురు కావాలి. సీత కిలాంటి ఆలోచనలు ఈరోజే కాదు, ఎప్పుడు, ఎక్కడ పెళ్లి మేళం వినిపించినా ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. మనస్సులో తుఫాను వీస్తూ ఉంటుంది. ప్రతి సంవత్సరం జరిగే ఈ దేవుడి పెళ్లి రోజున మరీ తనని తను నిగ్రహించుకో లేక పోతుంది.

సీతకి ఇరవై రెండేళ్లప్పుడు "నే సీతని పెళ్లి చేసుకుంటా" నని ఓ పాలేరు కుర్రాడు ముందు కొచ్చాడు. "తండ్రి చేసిన బాకీ తీర్చందే ఇలాంటి పిచ్చి పిచ్చి పనులు జరగటానికి వీల్లేదు" అని మంగమ్మ ఖచ్చితంగా చెప్పేసింది. ఇప్పుడు సీత వయస్సు ఇరవై తొమ్మిది. ఈ

రోజు దేవుడి పెళ్లికి సీతా అమ్మవారిని అలంకరించే బాధ్యత సీతకి అప్పగించింది మంగమ్మ. కంచు విగ్రహానికి అలంక రిస్తూన్నప్పుడు తనని తను సంబాళించు కోలేకపోయింది సీత.


ఫలితం ఏమంటే, పెళ్లికూతురైన సీతా అమ్మవారు సీత చేతిలో నాలుగు మొట్టికాయలు తిన్నా కిమ్మనకుండా బెల్లం కొట్టిన రాయిలా పెళ్లి పీటల మీద కూర్చుంది. సీత అలంకరించిన కళ్యాణ మంటపాన్ని ఓ సారి అనూయగా చూసి, తల విసురుగా తిప్పుకుని లోపలికి వెళ్లిపోయింది. నీరసంగా ఉండి కళ్ళూ, ఒళ్లూ తిరిగిపోతున్నట్లుగా ఉంది. నిలబడలేక గోడకి చేరగిలబడిపోయింది సీత.

"ఒసే, సీతా, అక్కడ మంగళసూత్రం పెట్టాను. నే పిలవగానే తలంబ్రాలూ, మంగళసూత్రం జాగ్రత్తగా పెళ్లి పందిట్లోకి పట్టుకురా. అక్కడే కట్నం చదివించే పట్టుచీర కూడా ఉంది. పట్టుకురా. జాగ్రత్త. నే పిలిచి నప్పుడే రా" అంటూ బొంగురు గొంతుకతో అరిచి అప్పుడే వచ్చిన అతిథులని పరామర్శించటానికి గబగబా వెళ్లిపోయింది మంగమ్మ.

సీత చలనం లేని బొమ్మలా అలాగే కూర్చుని ఉంది. ఎదురుగా తలంబ్రాలూ, వాటితో పచ్చని పసుపు దారం కట్టిన మంగళసూత్రం, వాటికి కొస్తదూరంలో జానెడు వెడల్పు జరీ పట్టు చీర.

సీత కళ్ల ముందున్న ఈ మూడూ గిరగిరా తిరుగుతూ వెక్కిరిస్తున్నాయి. సీత మనస్సులో ఎన్నో సంవత్సరాల నుంచీ

ప్రకృతి సహజమైన కోర్కెలు వయసుతోపాటు పెరిగి పూత పూయడం సహజమే. స్త్రీకి ప్రత్యేకమైన ఆశలు, కోరికలూ వయసుతో పాటు పెరిగి మొగ్గ తొడగ డమూ నిజమే. కులకనీ పలకనీ బొమ్మల పెళ్లిని చూసే కన్నెపిల్లలో ఎలాంటి తలపులు విరిసి విప్పారు తవో?




అణగదొక్కబడిన ఓ వెర్రి కోరిక మనస్సుని, ఇంగితజ్ఞానాన్ని ఓడించి సీతని లేవదీసి కూర్చోపెట్టింది. యాంత్రికంగా లేచి ఒక్కో అడుగూ మెల్లగా వేస్తూ వాటి దగ్గరికి వెళ్లింది. మంగళసూత్రాన్ని గట్టిగా పట్టుకుని పిడికిలి బిగించేసింది. తలలో ఎన్నో ఆలోచనలూ, ఆశలూ పాముల్లా కదులు తున్నాయి. సీత వాటి ధాటికి తట్టుకోలేక ఓడిపోయింది. సామానుల గది తలుపు గట్టిగా ఘడియ బిగించేసుకుంది లోపల.

ఇంక పెళ్లి పందిరిలో "మంగళ సూత్రధారణకి వ్యవధి లేదు. త్వరగా మంగళసూత్రం తెండి ... అందరికీ అక్షత లివ్వండి" అంటూ బిగ్గరగా కేకలు పెడుతున్నారు బ్రాహ్మణయ్యలు.

"సీత దగ్గ రున్నాయి, తీసుకు రండర్రా." మంగమ్మ కేకపెట్టింది.

ఒకరి వెంట ఒకరు ఎందరో ముత్తైదువులు లోపలికి వెళ్లారే గానీ, ఒక్కర్తూ బయటికి రారు. జగన్నాథం భార్య మీద గావుకేకలు పెట్టాడు. మంగమ్మ చరచరా వెళ్లింది—"ఎక్కడ చచ్చిందీ సీత? దరిద్రపు ముఖంది. ఎన్ని సార్లు చెప్పాను" అంటూ.

"మంగమ్మొదినా, సీత సామానుల గదిలో ఉంది. తలుపు తియ్యటం లేదు. ఏమొచ్చిందో?" అందరూ ఒక్కసారి అన్నారు.

"దీనికి 'బడితె పూజ' చేస్తే గానీ బుద్ధిరాదు."

మండిపడిపోతూ జగన్నాథం, మంగమ్మ ఒక్క గొంతుతో పిలిచారు — "సీతా, ఓ సీతా!తలుపు తెరు" అంటూ.

తలుపులు మెల్లగా తెరుచుకున్నాయి. అక్కడ చేరిన అందరూ ఒకేసారి లోపల కొరబడ్డారు.

జగన్నాథం ఒళ్లంతా మండిపోతూంది.

"సీతా!" అంటూ సీత కనిపించగానే నిర్ఘాంతపడి శిలావిగ్రహంలా నిలుచుండిపోయాడు. మంగమ్మ "ఆఁ" అని నోరు తెరిచేసింది ఒక్కసారి. అవిడ కూడా ఉన్న అమ్మలక్కలు "ఆఁ" అని నోరు తెరిచేశారు దాకల్లాగా.

సీత సీతా అమ్మవారికి గాను తెచ్చిన పట్టుచీరె కట్టుకుని, మంగళసూత్రం మిలమిలా మెరుస్తూంటే తనకి తనే కట్టుకుని నిశ్చలంగా నిలుచుని ఉంది. అంతేకాదు, నిర్భయంగా జగన్నాథం కళ్లలోకి సూటిగా చూస్తూంది.ఆ కళ్లలో పిసరంత కూడా భయం లేదు. పైగా, తన చిరకాల వాంఛితం నెరవేరిందనే తృప్తి, సంతోషం కలగాపులగంగా కలిసి చిరునవ్వు పెదవుల మీద నాట్యం చేస్తూంది. ఇదంతా చిత్తరువులా చూస్తూ నిలుచున్న మంగమ్మ క్షణంలో తేరుకుని సీతమీదికి ఆడపులిలా ఉరికింది. మంగళసూత్రం గుంజుకుని, సీతని చావబాది పెళ్లి పందిట్లోకి పరుగుతీసింది. నిర్ఘాంతపోయి నిలుచున్న జగన్నాథాన్ని బంధుజనం బలవంతంగా లాక్కువెళ్లి పీటల మీద కూర్చోబెట్టారు.

ఇక్కడ సీతని మిగతావాళ్ల తమ శక్తి ఉన్నంతవరకూ కొట్టి, బయటికి తోసి తలుపు గట్టిగా ఘడియపెట్టి, పెళ్లి పందిట్లోకి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు.


"నే చేసింది తప్పేమిటి? దేవుడు ప్రతి ఏడూ పెళ్లి చేసుకుంటున్నాడే. నేను ... నేను జీవితాని కంతా ఒక్కసారంటే ఒక్కసారి మంగళసూత్రం కట్టించుకోవాలని పెళ్లికూతు రవటం తప్పా? చెప్పండి. తప్పా నే చేసింది?" పిచ్చిదానిలా ఏడుస్తూనే ఉంది సీత.

కల్యాణమంటపంలోని పెళ్లికూతురు సీతా అమ్మవారికే గనక ప్రాణం ఉంటే "నా కీ పెళ్లి వద్దు" అని మొరాయించి ఉండేదేమో? కానీ, ఈ సీతా అమ్మవారు సీత మెడలోనించి గుంజుకొచ్చిన మంగళసూత్రాన్ని 'కిమ్మ'నకుండా కట్టించుకుంది. పెళ్లి బాజాలు ఝూమ్మని మోగుతూ ఉన్నాయి. పెళ్లికి వచ్చిన పెద్దలు అక్షింతల వర్షం కురిపిస్తూనే ఉన్నారు.

దేవుడి పెళ్లి ఏ ఆటంకమూ లేకుండా జరిగిపోతూంది. ఇలా ఇదివరలో ఎన్నో సార్లు జరిగింది. ఇప్పుడు జరుగుతూంది. ఇంకా ముందు నిక్షేపంగా జరుగుతుంది. ప్రాణం ఉన్న సీత లాంటి పిల్లలని వదిలేసి సీతా అమ్మవారి పెళ్లి జరిపించటమే కాదు, దేవుడి పెళ్లి చేసి బోలెడంత పుణ్యం మూట కట్టుకుంటున్నారు. *

58

# మార్గదర్శులు



© First Features

## ఏడు మైళ్ళ లోతుకు మొదటి మునక

స్విస్ శాస్త్రవేత్త జేక్స్ పిక్కార్డ్ అమెరికన్ సముద్ర శాస్త్రవేత్త రాబర్ట్ ఎస్. డీట్జ్‌తో కలిసి 1960 జనవరి 23 వ తేదిని మొదటిసారి సముద్రంలో ఏడు మైళ్ళ లోతుకు వెళ్ళారు.

వారు ప్రయాణం చేసిన బేథీస్కేవ్ 'ట్రియస్ట్' వాస్తవానికి ఒక బెలూన్ వంటిది. నీరుకన్న తక్కువ బరువు కలిగిన పెట్రోలియమ్‌తో దానిని నింపారు. దానికి దిగువను పది టన్నుల బరువు ఉన్న ఉక్కు గోళం—నీటికన్న బరువైనది—తగిలించారు. ఆ ఉక్కు గోళంలో పిక్కార్డ్, డీట్జ్ ఉన్నారు. నీటిలో మునగడానికి పిక్కార్డ్ బెలూన్ లోనికి నీరు రానిచ్చాడు. అది సెకనుకు మూడడుగుల వేగంలో లోతుకు వెళ్ళింది.

ప్రపంచంలోకెల్లా లోతయిన సముద్రగర్భం పసిఫిక్ మహాసముద్రంలో గ్వామ్ దగ్గర ఉన్న ఛాలెంజర్ డీప్‌లో ఈ సాహసకృత్యం జరిగింది. వారు సురక్షితంగా సముద్రగర్భం చేరుకొని తిరిగి పైకి రావడానికి బరువు తగ్గిస్తూ వచ్చారు. సముద్ర గర్భంలో ఇరవై నిమిషాలు గడిపారు ఉభయులూ. ఆ కాలంలో వారు చదరపు అంగుళానికి 16 వేల పౌన్ల ఒత్తిడికి తట్టుకొని బ్రతికే చేపల్ని చూశారు.

సుమారు ఎనిమిది గంటల 33 నిమిషాల తరవాత శాస్త్రజ్ఞులు ఇద్దరూ తిరిగి నీటిమీదికి రాగలిగారు.